ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
మంగళవారం | ఆగస్టు 04, 2026 | సంపుటి : 7 | సంచిక : 57 | పేజీలు : 2

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ రెడీ చేయండి

- రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి

వరంగల్, ఆయుధం: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలు చేయనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు.

మిగతా2లో..

20వేల పోస్టులకు 7 వేల పోస్టులతో నోటిఫికేషనా?

- యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఊదరగొట్టింది: కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, ఆయుధం: రాష్ట్రంలో నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. యూత్ డిక్లరేషన్ పేరిట ప్రచారంతో కాంగ్రెస్ ఊదరగొట్టిందని విమర్శించారు. జాబ్లు భర్తీ చేయకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు.

"రాష్ట్రంలో 20వేల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉంటే. 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడమేంటి? ఉద్యోగాలు అడిగితే ఎంక్రిన్ తాగి చావాలని.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను క్రిమినల్ వేస్ట్ అని సీఎం అంటున్నారు. ముఖ్యమంత్రి బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారు. సీఎం వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించరా..? యూత్ డిక్లరేషన్లో కాంగ్రెస్ 24 హామీలు ఇచ్చి ఒక్కటైనా నెరవేర్చిందా..? అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న రేవంత్రెడ్డి క్రిమినల్ వేస్ట్"

"సీఎం రేవంత్ రెడ్డి ఏం చదివారో కూడా నాకు డౌటే ఆయన ఎన్నికల నామినేషన్ పత్రం సొంతంగా నింపుకోగలరా?. ఆయన ఒక్క ఇంటర్వ్యూకైనా వెళ్లారా..? " అని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

బీజేపీ కంచుకోట బీటలు

భాజపాకు ప్రశాంత్ కిశోర్ షాక్.. బాంకీపుర్‌లో విజయబావుటా

జాతీయం, ఆయుధం:

బీహార్‌లో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. స్వయానా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితీన్ నబీన్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన స్థానంలోనే ఆ పార్టీ పరాజయం పాలైంది. నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన బాంకీపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ పై గెలుపొందారు. ప్రశాంత్ కిషోర్ విజయంతో జన్ సురాజ్ పార్టీ కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకొని సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ప్రశాంత్ కిషోర్ విజయంతో ఆ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని ఈ తాజా ఫలితం పటాపంచలు చేసింది. ఉప ఎన్నికల ఫలితాలపై మాట్లాడిన ప్రశాంత్ కిషోర్ బాంకీపూర్ ప్రజలు బీజేపీ

నాయకత్వానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపారని చెప్పారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తి బిహార్‌ను పాలించడాన్ని ప్రజలు ఏమాత్రం కోరుకోవడం లేదని వెల్లడించారు. విద్యావ్యవస్థను మెరుగుపరిచి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, బిహార్ బిడ్డలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా చూసే ఒక మంచి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. తమ పోరాటం వ్యక్తులపై కాదని వ్యవస్థలపై మాత్రమే అని ప్రశాంత్ కిషోర్ స్పష్టం చేశారు.

స్వతహాగా వ్యూహకర్త అయిన ప్రశాంత్ కిశోర్ తన వ్యూహాలకు మరింత పదును పెట్టారు. ప్రజలతో మమేకమవ్వడానికే అధిక ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో అధికార పార్టీలో ఉన్న విభేదాలు తనకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలీకృతమైన పీకే బీజేపీ కంచుకోటలో విజయం సాధించారు. 1995 నుంచి బాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా మారింది. అక్కడ జరిగిన ఎన్నికల్లో ప్రతిసారీ బీజేపీదే పూర్తి ఆధిపత్యం. అలాంటి కమలదళం కంచుకోటను ప్రశాంత్ కిషోర్ బద్దలుకొట్టారు.

మంజల్‌పుర్‌లో బీజేపీ అభ్యర్థి గెలుపు

మరోవైపు, గుజరాత్‌లోని మంజల్‌పుర్ శాసనసభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ విజయం సాధించారు. కాంగ్రెస్ తరపున బరిలోకి దిగిన బికాభాయ్ రబారీపై 30 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిచారు. బీజేపీ ఎమ్మెల్యే యోగేశ్ పటేల్ ఆకస్మిక మరణంతో ఆ స్థానం ఖాళీ కాగా తాజాగా ఉప ఎన్నిక నిర్వహించారు. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 182 స్థానాలకు గానూ 156 చోట్ల బీజేపీ విజయం సాధించింది.

కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ

- క్యాబినెట్‌లో 19 మందికి చోటు

బెంగళూరు, ఆయుధం : కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గాన్ని విస్తరించింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2 నెలలకు డీకే శివకుమార్ మంత్రివర్గాన్ని విస్తరించారు. క్యాబినెట్‌లో 19 మందికి చోటు కల్పించారు. లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. నూతన మంత్రులుగా నరేంద్ర స్వామి, శివరాజ్ తంగదగి, రుద్రప్ప లమానీ, బసవంతప్ప, నాగేంద్ర, రఘుమూర్తి, జమీర్ అహ్మద్ ఖాన్, రిజ్వాన్ అర్షాద్, సంతోష్ లాడ్, మధు బంగారప్ప, పుట్టురంగ శెట్టి, ఎస్ ఎస్ మల్లికార్జున, అజయ్ సింగ్, చలువరాయ స్వామి, శివలింగే గౌడ, బాలకృష్ణ, బసవరాజు రాయరెడ్డి, విజయానంద కాశప్పనవర్, లక్ష్మణ సవధి ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మొత్తం 33 మంది మంత్రులతో రాష్ట్ర మంత్రివర్గం కొలువుదీరింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఉప ముఖ్యమంత్రి డా. పరమేశ్వర్, రాష్ట్ర మంత్రి మండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర బాధ్యులు రణధీప్ సింగ్ సూర్జేవాలా తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో జడ్జిల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు పెంచుతూ బిల్లు

ఢిల్లీ, ఆయుధం : దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు 2026ను విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం, అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల చోరీ ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగలేదు. పలుమార్లు సభను వాయిదా వేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం అనంతరం సభ తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదు. ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లకుండా నినాదాలు కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని సంక్షిప్తంగా వివరించారు.

అనేకసార్లు విజ్ఞప్తి చేసినా!

అయితే స్పీకర్ సభ్యులను పలుమార్లు శాంతించాలని కోరారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, సభా సంప్రదాయాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. అయితే విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో చర్చ జరగలేదు. అనంతరం బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదం తెలిపింది. ఇదే సమయంలో ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షం తీసుకొచ్చిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా మూజువాణి ఓటుతో తిరస్కరించారు.

ఈ సవరణ బిల్లు ప్రకారం ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనుమతించిన సంఖ్యను 33 నుంచి 37కు

పెంచనున్నారు. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 34 నుంచి 38కు చేరుతుంది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల సంఖ్య, న్యాయమూర్తులపై అధిక పని భారం, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాల్సిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభను మంగళవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. గత వారం కూడా జనన, మరణాల నమోదు చట్ట సవరణ బిల్లు విపక్షాల ఆందోళనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించింది.

మరో కీలక బిల్లును కూడా!

ఇదిలా ఉండగా, సోమవారం లోక్‌సభలో మరో కీలక బిల్లును కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. భారతీయ గణాంక సంస్థ (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ -ఐఎస్ఐ)కు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను కల్పించే భారతీయ గణాంక సంస్థ బిల్లు-2026ను కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లు ద్వారా ప్రస్తుతం 1959 చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. ఐఎస్ఐను బాడీ కార్పొరేట్‌గా ఏర్పాటు చేసి పాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, విద్యా, పరిశోధనా రంగాల్లో ప్రపంచ స్థాయి సంస్థగా తీర్చిదిద్దడం, గణాంక శాస్త్రం, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పరిమాణాత్మక ఆర్థిక శాస్త్రం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవసరాలకు అనుగుణంగా సంస్థను తీర్చిదిద్దడం బిల్లు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది.

2 లో

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- అధికారులు సమగ్ర దృక్పథంతో పనిచేయాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

2 లో

28 బైక్‌లు స్వాధీనం

- వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు అరెస్టు
- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్

2 లో

వెల్ నెస్ సెంటర్ లోమెరుగైన వైద్యం అందించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్.రవి
- వెల్ నెస్ సెంటర్ ఆకస్మికంగా తనిఖీ

టీజీఎస్ ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల ఎంపిక ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఆయుధం: ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల ఎంపిక ఫలితాలను తెలంగాణ పోలీసు నియామక మండలి సోమవారం విడుదల చేసింది. గతేడాది సెప్టెంబర్ 17న మొత్తం 1743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా.. మొత్తం 1604 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు తెలిపింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఓ నోట్‌ను విడుదల చేసింది. 1000 డ్రైవర్ పోస్టులకు 894మంది ఎంపిక కాగా.. 743 శ్రామిక్ పోస్టులకు 710మంది ఎంపికయ్యారు. డ్రైవర్ పోస్టుకు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్‌లు అభ్యర్థుల లాగిన్‌లలో అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది.

సెలక్షన్ జాబితాలు, అన్ని కేటగిరీల వారీగా కటాఫ్ మార్కులను తమ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు బోర్డు తెలిపింది. తుది నియామకం అభ్యర్థుల క్యారెక్టర్, ప్రవర్తన వెరిఫికేషన్, వైద్య పరీక్షల్లో అర్హత సాధించడంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ఆగస్టు 7న ఉదయం 8గంటల నుంచి 11వ తేదీ అర్ధరాత్రి వరకు డిజిటల్ రూపంలో అటెస్టేషన్ ఫారం నింపాల్సి ఉంటుందని తెలిపింది. ఆగస్టు 17న మూడు కాపీల అటెస్టేషన్ ఫారాలు, సంబంధిత ధ్రువపత్రాలను ఆయా పోలీస్ జిల్లా, కమిషనరేట్ కార్యాలయాల్లో సమర్పించాలని బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.

ములుగు, ఆయుధం: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2026లో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో అన్ని వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయడంతో పాటు బీఎల్‌వోల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారు, గుర్తించలేని వారు, మరణించిన వారి జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, మారిన ఓటర్ల జాబితాపై బీఎల్ఏల సంతకాలు తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని,

ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే వారందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీవీఐపీలు, వీఐపీల ఓటరు మ్యాపింగ్‌ను సహాయ ఎన్నికల నమోదు అధికారులు స్వయంగా పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నమోదు అధికారి ఆర్డీవో కృష్ణవేణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వినతులను పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఎన్. రవి
- కలెక్టరేట్ లో ప్రజావాణి కార్యక్రమం

హనుమకొండ, ఆయుధం: ప్రజావాణి వినతులను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వినతులను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 252 వినతులను అందజేయగా అక్కడే ఉన్న జిల్లా అధికారులు, తహసీల్దార్లను వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఇన్చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ రవి మాట్లాడుతూ ప్రజావాణి పోర్టల్ లో ఉన్న వినతులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

- ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

వరంగల్, ఆయుధం: ఆటో కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, హెల్త్ కార్డ్‌లు మరియు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. తమ్మెర భవన్ శివనగర్ లో ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా నిర్మాణ మహాసభ యండి అక్బర్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆర్థిక భారాలు, ఉపాధి కోల్పోవడం, సంక్షేమ పథకాలు అందకపోవడంమని విపరీతంగా పెరిగిన స్పేర్ పార్ట్స్ ధరలు, గ్యాస్/డీజిల్ ధరలు, వాహన పన్నులవల్ల ఇబ్బది పడుతున్నరని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఎలక్ట్రిక్ ఆటోలు, ఆన్‌లైన్ క్యాబ్ సేవల వల్ల తగ్గిన ఆదాయం లేదని ఆరోగ్య భద్రత, సరైన పెన్షన్, ప్రమాద బీమా వంటి సదుపాయాలు లేకపోవడం. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని లేదా సబ్సిడీలను వెంటనే నేరుగా ఆటో కార్మికులకు అందించాలి కొత్త రవాణా విధానాలను ప్రవేశ పెట్టే ముందు ఆటో యూనియన్లతో చర్చించి, వారి ఉపాధికి భద్రత కల్పించాలి. ప్రతి ఆటో కార్మికునికి సంవత్సరానికి 25 వేల రూపాయలు అందించాలని పిల్లలకు ఉచిత విద్య స్కాలర్ షిప్లు ఉన్నత విద్యకు తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి గుండె బద్రి, జన్ను రవి, రమేష్, తోట మల్లయ్య, రాజన్ బాబు, దాసరి రాము, లావుడ్య దస్రు, యునిస్ నరేందర్, బానాల మహేష్, మాల్లా రెడ్డి, శ్రీనివాస్, కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

నడికూడ, ఆయుధం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడికూడ నందు యూత్ ఫర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు దొంతుల శ్రీనివాస్ అధ్యక్షతన పాఠశాలలో జరిగిన సమావేశంలో 8వ తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఫౌండేషన్ వారు దాదాపు రూ.2,500/ విలువ చేసే స్టడీ మెటీరియల్ వరంగల్ ఇంచార్జ్ సుద్దోజు అనిల్ చారి అందజేశారు. దొంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చని అన్నారు. యూత్ ఫర్ సేవా సంస్థకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు జయ, శివచేతన్, శ్రవణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సుభాని, జ్యోత్స్న, శారద, శివకుమార్ లు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రేజీకి డీపీఆర్ సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి..)

సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేయనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు, అర్బన్ చాలెంజ్ ఫండ్, ఇతర పట్టణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ, అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద చేపట్టాల్సిన ప్రతిపాదనలు, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అంశాలు, తదుపరి కార్యాచరణపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. డా. టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి దశకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక (టైమ్‌లైన్) రూపొందించి, నిర్దేశిత గడువులోగా డీపీఆర్‌లు, అర్బన్ చాలెంజ్ ఫండ్ ప్రతిపాదనలు, ఇతర అనుబంధ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు, అర్బన్ చాలెంజ్ ఫండ్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలు నిర్దేశిత కార్యాచరణ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. డీపీఆర్ తయారీతో పాటు సాంకేతిక, పరిపాలనా అనుమతులకు సంబంధించిన అన్ని ప్రక్రియలను కూడా గడువులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ క్యాంపు కార్యాలయం నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవికుమార్, సంజయ్‌కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన 28 బైక్‌లు స్వాధీనం

- వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు అరెస్టు
- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్

హనుమకొండ, ఆయుధం: వరుసగా ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి 28 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదుకాగా బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తునందుకు సెంట్రల్ జోన్ డిసిపి కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీం లను నియమించినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయన్నారు. కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడారు.

మంచిర్యాలకు చెందిన దొంతుల ప్రశాంత్ కుమార్(20), దుర్గం సాయి కార్తీక్(21), వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్ No. AP 36 AY 4700 గలదాన్ని పోలీస్ టీం స్వాధీనం చేసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం అందించారు. వారి చూపిన మేరకు KUC PS మునిపల్లి గ్రామ శివారు, ఎలుకతుర్తి సమీపంలోని ప్రాంతాల నుండి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వరంగల్ కమీషనరేట్ లో8, కరీంనగర్ కమీషనరేట్ లో9, రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి లో3, సిద్దిపేట కమీషనరేట్ లో 2 హైదరాబాద్ కమీషనరేట్ లో3, రాచకొండ కమీషనరేట్ లో 1, భూపాలపల్లి జిల్లాలో 2 మొత్తం 28 మోటార్ సైకిల్ల దొంగతనాలు చేసినారు. వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితులపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదైనట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్కింగ్ చేసి, స్టీరింగ్/వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వరుస వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ లు ఎ.రాఘవేందర్, ఈ.హరికృష్ణ కె.రామకృష్ణ, కేయూసీ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సీసీఎస్ ఎస్సై శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్లు నసీమ్ అహ్మద్, రవిప్రసాద్, జంపయ్య, కానిస్టేబుల్లు విశ్వేశ్వర్, వంశీ, వినోద్ లను, ఐటీ కోర్ టీం ఏవో ఎస్డీ.సల్మాన్ పాషా, కానిస్టేబుల్ నగేష్, కేయూ క్రైమ్ కానిస్టేబుళ్లను సీపీ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో హన్మకొండ, సిసిఎస్ ఏసీపీ లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్యం అందించాలి

- వెల్ నెస్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టర్

హనుమకొండ, ఆయుధం: వెల్ నెస్ సెంటర్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. సోమవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల పక్కన ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లకు వైద్య సేవలను అందించే వెల్ నెస్ సెంటర్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ నెస్ సెంటర్ లోని జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెంటల్, కంటి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించారు. ఎంతమంది వైద్యులు, సిబ్బంది విధులకు హాజరయ్యారని అదనపు కలెక్టర్ వెల్ నెస్ సెంటర్ ఇన్ ఛార్జీ డాక్టర్ సుష్మితను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. అక్కడికి వైద్య సేవల నిమిత్తం వచ్చిన పేషంట్లతోనూ మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉంటున్నాయని అడిగారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ వెల్ నెస్ సెంటర్ కు వచ్చే పేషంట్లకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. వెల్ నెస్ సెంటర్ వద్ద పరిసరాలు బాగుండాలన్నారు. ప్రత్యేక విభాగాల వైద్య నిపుణుల చేత కూడా వైద్య సేవలను పేషంట్లకు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాబ్ ద్వారా పేషంట్లకు అవసరమయ్యే వివిధ పరీక్షలని నిర్వహించాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులుగా నాంపల్లి రవీందర్

వరంగల్, ఆయుధం: వరంగల్ శివనగర్ ఫోర్ట్ రోడ్ కు చెందిన నాంపల్లి రవీందర్ ను రాష్ట్రీయ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు గా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు మండల భూపాల్ నియామక పత్రం సోమవారం అందించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో ధార్మిక కార్యక్రమంలు సనాతన ధర్మ పరిరక్షణ చర్యలు, హిందూ ధర్మ పరిరక్షణ చేపట్టాలని కోరారు.

పార్లమెంట్ సమావేశాల్లో.. దళిత క్రైస్తవ ఎస్సీ హోదా కల్పించాలి

- దళిత క్రైస్తవ శాంతి యుత మహాదిక్షలు ప్రారంభం

వరంగల్, ఆయుధం: పార్లమెంట్ సమావేశంలో దళిత క్రైస్తవ ఎస్సీ హోదా కల్పించాలని ఎస్సీ ప్రెసిడెన్సియల్ ఆర్డర్ పేర 3ని పార్లమెంటు సమావేశంలో సవరణ రద్దు పరచాలని వరంగల్ పోచం మైదాన్ సెంటర్లో దళిత క్రైస్తవ ఐక్యవేదిక డిసిఐవి వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాదిగ ఆధ్వర్యంలో మొదటి రోజు దళిత క్రైస్తవ శాంతి యుత మహాదిక్షలను ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యుబ్ ప్రారంభించారు. ఈ దీక్షలను ఉద్దేశించి ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని గౌరవించి మత స్వేచ్ఛ హక్కు దళిత క్రైస్తవులు కూడా ఇవ్వాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేజీ బాలకృష్ణ కమిషన్ నివేదిక ఇచ్చి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతిస్తూ దళిత క్రైస్తవ ఎస్సి హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ ప్రెసిడెన్సియల్ దళిత క్రైస్తవ ఎస్సి హోదాదా ఇవ్వాలి భారతదేశం అన్ని మతాలను గౌరవించే రాజ్యాంగం అన్ని కులాలను గౌరవించే రాజ్యాంగం దాని అనుసరిస్తూ మన ముందుకు పోవాల్సిన అవసరం ఉన్నది రాబోయే రోజులలో దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా అండగుంటది. ఇది ఒక్క కాంగ్రెస్ పార్టీ ఒక కులానికో మతానికి కాదు ఈ ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రతి ఒక్కరికి ఈ దేశ పౌరులను ప్రతి ఒక్కరికి అందరిని గౌరవించి హక్కులను కాపాడే విధంగా ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు

ఈ సమావేశంలో ఈర్ల కుమార్ మాదిగ దళిత క్రైస్తవ ఐక్య వేదిక డిసిఐవి వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత క్రైస్తవ శాంతియుత మహా దీక్షలు ఆగస్టు 3 నుండి 7 వరకు దీక్షలు కొనసాగుతాయి ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ ప్రెసిడెన్సియల్ ఆర్డర్ పేరా 3నీ సవరణచేసి కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు పరచాలనీ డిమాండ్ చేశారు. ఈ దీక్షలో మాజీ ఏంఎల్సి పుల్ల పద్మ భాస్కర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్స్ డాక్టర్ నతనియాల్, దుబ్బ విజయ్ కుమార్, మిద్దేంటి శ్రీనివాస్, బస్వరాజు కుమార్, దొమ్మటి ప్రవీణ్ విరమింప చేశారు. దీక్షలో సందేలా లాజర్, డి సిఐవి వరంగల్ తూర్పు కన్వీనర్ ఎం కే బాబు, జన్ను యేసేప్ రాజ్, జన్ను ప్రశాంత్, నేతలు సిలువేరు నగేష్, ఎర్రోళ్ల బాబు, నాగారపు స్వామి, ఈర్ల హరినాథ్, జన్ను దయాకర్, దౌడు విజయ్ రాజు, డాక్టర్ గనిపాక క్రాంతి, జన్ను శ్యామ్, జన్ను ప్రమోద్ , జన్ను కర్ణాకర్, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం

- అధికారులు సమగ్ర దృక్పథంతో పనిచేయాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

హనుమకొండ, ఆయుధం: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం ఏమాత్రం సహించబోమని, ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులో పరిష్కరించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను కమిషనర్ స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 98 దరఖాస్తులు అందాయి. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమగ్ర దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఏఈలు, డీఈలు, ఈఈలు బోనాలు, బతుకమ్మ వంటి ప్రధాన పండుగలకు సంబంధించి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన అంచనాలు (ఎస్టిమేట్లు) ముందుగానే రూపొందించి, పరిపాలనా అనుమతులు, సాంకేతిక అనుమతులు పొందడంతో పాటు టెండర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి పనులు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి క్యాలెండర్ సంవత్సరంలో నిర్వహించాల్సిన పండుగలపై పూర్తి అవగాహనతో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. తాను నిర్వహించే శానిటేషన్ తనిఖీల సమయంలో పన్ను వసూళ్ల పురోగతిని కూడా సమీక్షిస్తానని తెలిపారు. నగర పరిధిలోని ప్రతి వ్యాపార సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందిన తర్వాతే కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాదేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, కార్యదర్శి అనిల్ బాబు, హెల్త్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వేలేరు, ఆయుధం: వేలేరు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సుస్మిత కంటి హస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల క్యాంపు నిర్వహించారు. వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, బిల్లా యాదగిరి పాల్గొని, క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేలేరు గ్రామ ప్రజలు ఎవరైనా కంటి సమస్యలు ఉన్నట్టయితే ఇలాంటి కంటి పరీక్షల క్యాంపు ఉపయోగించుకోవాలని, వేలేరు గ్రామంలో ఈ కంటి పరీక్షల క్యాంపు ఏర్పాటు చేయాలని హాస్పటల్ యాజమాన్యాన్ని కోరగానే ఉచిత కంటి క్యాంపు ఏర్పాటు చేసిన సుస్మిత కంటి హాస్పటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, జిపి కార్యదర్శి విజయ, వార్డు సభ్యులు ప్రశాంత్, చైతన్య, సురేష్, సునీల్, హాస్పటల్ నుండి డాక్టర్ అనూష, అఖిల్, గ్రామస్తులు పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు.

జక్కి అశోక్ కుటుంబానికి రూ.2.01 లక్షల ఆర్థిక సాయం

వరంగల్, ఆయుధం: వరంగల్ కాశీబుగ్గ 20వ డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జక్కి అశోక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి అండగా చిన్ననాటి స్నేహితులు, BTech క్లాస్‌మేట్స్ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అశోక్, దళిత బంధు పథకం ద్వారా సిమెంట్ దుకాణం నిర్వహించేవారు. అయితే వ్యాపారంలో అప్పులు రావడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. అశోక్ కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి మిత్రులు, క్లాస్‌మేట్స్ గత నెలలోనే రూ.75 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం అమెరికాలో ఉన్న స్నేహితులు, కిట్స్ కళాశాల B.Tech మిత్రులు, స్థానిక స్నేహితులు కలిసి "స్నేహితుల దినోత్సవం "సందర్భంగా సోమవారం మరో రూ.2.01 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ భార్య, కుమారుడికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్నేహితులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కిట్స్ కళాశాల B.Tech మిత్రులు, కాశీబుగ్గ చిన్ననాటి స్నేహితులు, BRS నాయకులు, మాజీ RTA సభ్యుడు గోరంటల మనోహర్, రామకృష్ణ, చల్లా వేణుగోపాల్, ఊరుగొండ రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతాపరుద్ర తాపీ మేస్త్రి పరపతి సంఘం ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షునిగా రాజేశ్వర్ ప్రధాన కార్యదర్శి పెద్ది నగేష్

వరంగల్, ఆయుధం: వరంగల్ రంగసాయిపేట, శంభునిపేట తాపీ మేస్త్రీల అడ్డ వివిధ ప్రాంతాలకు చెందిన తాపీ మేస్త్రీల సంఘం గత 12 సంవత్సరాల క్రితం ఏర్పడి ప్రతాపరుద్ర తాపీ మేస్త్రి పరపతి సంఘం ఏర్పరచుకొని ఈరోజు ఆరవ మహాసభ అనంతరం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గత సంవత్సరము ఉన్న కార్యవర్గాన్ని గౌరవ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు ఎస్కే.నాగూర్, దుబ్యాల రాజయ్య, అధ్యక్షునిగా కొంగండి రాజేశ్వర్, ఉపాధ్యక్షులు నాగవెల్లి పాపయ్య, ప్రధాన కార్యదర్శి పెద్ది నాగేష్, కోశాధికారి మండల చిరంజీవి, సహాయ కోశాధికారి దుద్యాల చరణ్, కోదాటి సమ్మయ్య ఆర్గనైజర్స్ నర్రా ఇంద్రసేన ఆవునూరి సురేష్ మజ్జిగ రంజిత్ కొల్లూరి మధు, కార్యవర్గ సభ్యులుగా మేకల బిక్షపతి, దుంపల రవి, మేకల భద్రయ్య, జింక దేవేందర్, ములకలపల్లి మహేందర్, పెద్ది అశోక్, గాదే సంజీవ్, ముఖ్య సలహాదారులు మండల ప్రభాకర్, బొల్లు ఎల్లయ్య, చెవ్వు ఎల్లయ్య నాగవెల్లి సత్యం, కూతురి నాగేష్, మండల ఐలయ్య, వల్లాల రవి, ఆవునూరి కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతాపరుద్ర తాపీ మేస్త్రిల పరపతి సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గౌరవ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ బాధ్యత ఇచ్చినందుకు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695